# ఇవ్వాలని ఉంది

**పది లీటర్ల పాలు పట్టే పెద్ద స్టీలు గిన్నె! జిగ్ జాగ్‌మని మెరిసిపోతూ చాలా బాగుంది. ఎక్కడైనా లొత్తలు వున్నాయేమోనని కిందా మీదా తిప్పి చూసేను.**

"అమ్మా! మరొక చీర వెయ్యండమ్మా. ఆ గిన్నె యిచ్చేస్తాను" అంది స్టీలు గిన్నెలమ్మే మనిషి.

"ఇప్పటికే మంచి చీరలు అయిదు యిచ్చేసాను. పాంట్లు, షర్టులు, మేక్సీలు యివన్నీ యిచ్చేను. మరి లేవు. నా దగ్గర" అన్నాను. "ఎవరి కోసం యివ్వదు? అంతమంచి చీరలు యిచ్చేను. అదే యిస్తుంది!" అన్న ధీమాతో. ఇంకా చీరలు వున్నా యివ్వదల్చు కోలేదు. నేనూహించినట్టుగానే అది ఆ బట్టలన్నీ మూటగా కట్టి బుట్టలో పెట్టింది.

"అమ్మగారూ! ఈసారి యింకా ఎక్కువ చీరలు యివ్వాల. బట్టలు మరెవ్వరికీ యిచ్చేకండి. నాకే యివ్వండి. నేను మల్ల వస్తాను" అంది అది.

"అలాగే లేవే" అన్నాను కొత్త గిన్నెను చూసుకుని మురిసిపోతూ. నిజం చెప్పాలంటే ఆ స్టీలు గిన్నె మీద మోజు కొద్దీ రోజూ వాడుతున్న చీరల్లో కాస్త మంచివి కూడా తీసి దానికిచ్చేసాను. ఇంటి నిండా స్టీలు సామాన్లు వున్నా యింకా స్టీలు పిచ్చి పోలేదు నాకు. ఆడవాళ్ళందరికీ అంతేనేమో. అయిదు నిమిషాల కిందటే వచ్చిన విజయ, నా చేతిలో వున్న స్టీలు గిన్నెని, నేను యిచ్చిన చీరల్ని మార్చి మార్చి వింతగా చూస్తోంది.

"గిన్నె చాలా బాగుంది ఆంటీ! దళసరిగా కూడా వుంది" అంది గిన్నెను మెచ్చుకుంటూ. ఆ చీరలు ఎంత మంచివో, ఒక్కొక్క చీర నేను ఎన్నిసార్లు కట్టుకున్నానో వగైరా విషయాలన్నీ పూస గుచ్చినట్టు చెప్తున్న నేను సడన్‌గా విజయ కట్టుకున్న చీరవైపు అనుకోకుండా చూసేను. విజయ చీర బాగా వెలిసిపోయి వుంది. చీరకి కుట్టిన ఫాల్ వూడి పోయింది. కుచ్చెళ్ళ దగ్గిర కొంత చిరిగిపోయి వుంది. చక్కని పిల్ల... ఈ చింకి చీర కట్టుకోవడం... విజయని చూస్తుంటే నాకు జాలి వేసింది. చాలా ఆత్మాభిమానం గల అమ్మాయి. ఎక్కడా బయటపడదు. గొప్ప గుట్టు. ఇంట్లో పస్తులున్నా పంచ భక్ష్య పరమాన్నాలు తిన్నంత సరదాగా మాట్లాడుతుంది పైకి. తన కష్టాలు తన యిబ్బందులు మూడో కంటి వాళ్ళకి తెలియకుండా జాగ్రత్తపడ్తుంది. ఎవర్నీ ఏదీ చేయి చాచి అడగదు. అంత అభిమానవతి! ఆ అమ్మాయి చీర చూస్తే చాలు వాళ్ళ పరిస్థితి అర్థమైపోతుంది ఎవరికైనా. నేను యిందాక స్టీలు గిన్నెల దానికి యిచ్చిన చీరలు విజయ కట్టుకున్న చీర కంటె వెయ్యి రెట్లు బాగున్నాయి. ఆ సంగతి విజయకి తెలుసు. అందుకే అంత మంచి చీరలు నేనిచ్చేస్తుంటే పాపం కళ్ళు విప్పార్చుకుని చూసింది. నా దగ్గర యింకా చాలా చీరలున్నాయి. అన్నీ మంచివే. ఏం చేసుకోను అన్ని చీరలు! ఎక్కడి కెళ్ళినా ఆయన నా కోసం తనకి నచ్చిన చీరలు కొనితెచ్చి పోస్తుంటారు.

"ఎందుకండి నాకిన్ని చీరలు? సాధారణంగా ఎవరిళ్ళకీ అట్టే వెళ్ళను కదా. ఎందుకు తెస్తారు! డబ్బు దండగ" అన్నా వినిపించుకోరు. అదొక సరదా ఆయనకి. ఆయన తెచ్చిన వాట్లో నాకు నచ్చనివి కొన్ని వున్నాయి. అవి ఆయన తృప్తి కోసం నాలుగైదు సార్లు కట్టుకుని వుంచేస్తాను. విజయని చూస్తుంటే ఒక ఆలోచన వచ్చి లోపలికి వెళ్ళాను. బీరువా తలుపు తీసి నాకు నచ్చని

చీరల్లో కొన్ని తీసి యువతల పెట్టి విజయని పిల్చేను.

ఆడవాళ్ళకి చీరలు చూడ్డం అన్నా, నగలు చూడ్డం అన్నా భలే సరదా. విజయ ఆశ్చర్యంగా ఆ చీరలు చూస్తోంది. నేను విజయని చూస్తున్నాను. ఆ పిల్ల కళ్ళల్లో ఆశ్చర్యం, పెదవుల విరుపులో నిరాశ నాకు స్పష్టంగా కనబడ్తున్నాయి.

"ఈ రెండు చీరలు నువ్వు కట్టుకో విజయా! ఏమీ అనుకోకు నేనిలా అన్నానని. నీకు చీరలున్నాయిలే. కాని ఈ చీరలు నీ వంటికి బాగా నప్పుతాయని!" ఆమె మనసుకి కించపర్చకుండా కాపాడాలనే వుద్దేశంతో అన్నాను.

"ఎందుకు ఆంటీ! నాకు బోలెడు చీరలు వున్నాయి. నాన్నగారు ప్రతీ పండక్కి చీరలు తెస్తారు!" అంది మొహమాటంగా. అది ఎంత పచ్చి అబద్ధమో నాకు తెలుసు. కాని ఆ పిల్ల బాధ పడ్తుందని వూరుకున్నాను.

"ఫర్వాలేదు. కట్టేసుకో. నాకు లెక్కలేనన్ని చీరలు వున్నాయి. పాతవి కావుసుమా. ఇవన్నీ ఆయన తృప్తికోసం వొక్కసారి కట్టి మళ్లీ ఇస్త్రీ చేయించినవే. నువ్వు కట్టుకుంటే ఈ చీరలకే అందం వస్తుంది" అని బలవంతంగా ఆ అమ్మాయి చేతిలో పెట్టేను. అంత ఆత్మాభిమానం గల పిల్లకు ఈవిధంగా సహాయపడ్తున్నందుకు నా మనసు అదో విధమైన తృప్తితో నిండిపోయింది. ఆ చీరల మీద మోజు కొద్దో, లేక తన యింటి ఆర్థిక పరిస్థితి గుర్తుకొచ్చో లేక నేనేమనుకుంటాననో, మొత్తం మీద మొహమాట పడ్తూనే ఆ చీరలు తీసుకుని వెళ్ళింది.

మర్నాడు మా పొరుగింట్లో అవుతున్న పెళ్ళికి నేను, మా అమ్మాయి దీప- వెళ్ళేం. అక్కడ విజయ నేనిచ్చిన చీర కట్టుకుని వుంది. ఆ అమ్మాయి ముఖంలో వింత వెలుగు. "ఆంటీ!" అంటూ సరదాగా నా దగ్గర కొచ్చి కూర్చుంది. చాలా మంది పేరంటాళ్లతో హాలంతా నిండిపోయింది.

మా దీప పదిహేనేళ్ళది. టెన్త్ పరీక్ష రాసింది మొన్ననే. అది విజయ కట్టుకున్న చీర వైపు చూసింది.

"విజయా! ఇది మా మమ్మీ చీర కదూ." విజయ మొహం పాలిపోయింది. ఇటువేపు తిరిగి నా కళ్లలోకి జాలిగా చూసింది. అసలే పౌరుషం, ఆత్మాభిమానం ఎక్కువ ఆ పిల్లకి! దీపకి ఎక్కడ ఎవరితో ఎలా మాట్లాడాలో బొత్తిగా తెలీదు. దీని మాటలకి పాపం విజయ ఎంత నొచ్చుకుందో! నా గుండెలు దడదడలాడేయి. విజయ మానసిక స్థితి నేనూహించగలను. దీపని ఈడ్చి లెంపకాయ కొట్టాలనిపించింది. కాని దీప కూడా కుతూహలం చావని చిన్నవయసుదే కదా. "దీపా, అల్లక్కడ చూడు; పేపర్ గ్లాసుల్తో మంచినీళ్లిస్తున్నారు. వెళ్ళి నాకోగ్లాసుడు నీళ్లు తెచ్చిపెట్టు; గొంతుకలో ఏదో చిక్కుకుంది;" అన్నాను. దాని ధర్మమా అని దీప లేచి వెళ్లింది.

"విజయా, మా దీప అన్నమాటలకి చిన్నబుచ్చుకోకమ్మా. నువ్వు చిన్నదానివి; ఆత్మాభిమానం ఉన్నదానివి. నాకు తెలుసునమ్మా. కాని, అది నీకన్నా చిన్నపిల్లే కదా. దానికి ఎవరితో ఎప్పుడు ఎలా మాట్లాడాలో తెలిసే వయసురాలే దాంకాను. ప్లీజ్. నాకుగాని దీపకిగానీ నువ్వేమీ జవాబు చెప్పకు. అదుగో, నీళ్లగ్లాసు పెట్టుకొని వచ్చేస్తోంది. ఏం ఎరగనట్టుండూ," అన్నాను. విజయ తల వూపింది.

విందు భోజనాలయ్యేయి. ఎవరిళ్ళకి వాళ్లువచ్చేశాం.

"దీపా, కడుపునిండా భోంచేసేవమ్మా?" అని పలకరించేను" ఆ అన్నం ఎవడొండేడోగాని, మరీ మేకుల్లా ఉందికదూ." అన్నాను.

"అందుకే, నేను పులిహోరలోనే పెరుగేసుకున్నాను." అంది దీప.

అది, నాకు కావలసిన మనఃస్థితి.

"అందుచేత; దీపా; నేను చెప్పేదేంటంటే నీకు ఒకరి మీద సానుభూతి కలిగి ఏదైనా వస్తువు యిచ్చేవనుకో. ఆ వస్తువు యిచ్చినట్టుగా నువ్వు మర్చి పోవాలి. మాటిమాటికి పది మందిలో గుర్తు చేస్తూ- ఇది నేను ఇచ్చేను అని చాటి చెప్పుకుంటే ఇచ్చిన దానికి ఫలితం వుండదు. అవతల వాళ్ళు తక్కువ తనాన్ని ఎత్తి చూపినట్టుగా వుంటుంది. అది గొప్ప, గర్వం అనిపించు కుంటుంది. మనం తెల్సినా తెలియకపోయినా ఎదుటి వాళ్ళ మనసు కష్టపెట్టకూడదు- ఈ మాట అంటే ఎదుటి వాళ్ళు ఏమనుకుంటారు. అని ఆలోచించి ప్రతీ మాట మాట్లాడాలి. నీ కంతగా సందేహం వుంటే యింటికి కొచ్చేక నన్ను అడగాల్సింది. అంతేగాని అలా నలుగురిలో ఆ అమ్మాయిని చీరగురించి అడిగేవే, పాపం ఆ పిల్ల ఆత్మాభిమానం దెబ్బతిందూ?"

"సారీ మమ్మీ. మరెప్పుడూ అలా మాట్లాడను" అంది దీప, తల వంచుకుని.

ఆ మర్నాడు పొద్దున్న విజయ నేనిచ్చిన రెండు చీరలు కాగితంలో చుట్టి తిరిగి యిచ్చేస్తూ అంది.

"మా నాన్నగారు కోప్పడ్డారు ఆంటీ. నీకు బోలెడు చీరలు వున్నాయి కదా. ఎందుకు యితరుల చీరలు కట్టుకోవడం అని అన్నారు!" ఆ పిల్ల కళ్ళు ఎర్రబారి వున్నాయి.

"విజయా..." నేనేదో చెప్పబోయేంతలోనే ఆ పిల్ల పరుగెత్తినంత వేగంగా వెళ్ళిపోయింది.

★ ★ ★

*(ఆంధ్రజ్యోతి, వీక్లీ ; 20-5-1988)*